# కడెంలో పడి కూలీ మృతి



శివాజీ మదవ్ (ఫైల్)

కడెం, మే 28 : కడెంకు మరమ్మతు పనులు చేసేందుకు వచ్చిన కూలీ ప్రాజెక్టు దిగువన గల ఆఫ్రాన్ ప్రాంతంలోని నీటి మడుగులో పడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని మంజ్రీ గ్రామానికి చెందిన శివాజీ మదవ్(23) అదే గ్రామానికి చెందిన మరో నలుగురు యువకులతో కలిసి ప్రాజెక్టు పనులకు వచ్చాడు. పనులు ముగించుకుని మధ్యాహ్నం భోజనం చేశాడు. చేతిని కడుక్కోవడానికి ప్రాజెక్టు నీటిలోకి వెళ్లా డు. అనంతరం అక్కడి నీటిలో స్నానానికి దిగినట్లు తోటి పనివారు తెలిపినట్లు చెప్పారు. ప్రమాదవశాత్తు మడుగులో పడినట్టు తెలిపారన్నారు. కడెం, పరిసర ప్రాంతాల్లో గజ ఈతగాళ్లు అందుబాటులో లేని కారణంగా ఖానాపూర్, నిర్మల్ ప్రాంతాలకు చెందిన వాళ్లతో సంప్రదింపులు జరుగుతున్నట్లు తెలిపారు. కాగా, మదవ్ మరణవార్త తెలుసుకున్న గుత్తెదారు నవీన్‌రెడ్డి తన ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసి అందుబాటులోకి రావడం లేదని, దీంతో నీటి పారుదలశాఖ అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. బుధవారం దాటితే గాని మృతదేహం బయటకు తేలే పరిస్థితి కనిపించడం లేదు. మంజ్రీ గ్రామానికి చెందిన వారి కుటుంబ సభ్యులు, బంధువులకు సమాచారం అందించినట్టు కడెం ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

# భోరజ్ చెక్‌పోస్టుపై ఏసీబీ దాడులు

- అదుపులో ఇద్దరు ఆర్టీవో అధికారులు
- పూర్తిస్థాయిలో రికార్డుల పరిశీలన



తనిఖీ చేస్తున్న ఏసీబీ అధికారులు

జైనథ్, మే 28 : రాష్ట్ర వ్యాప్తంగా అవినీతి అక్రమాలను నిరోధించడానికి ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు మంగళవారం ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని భోరజ్ చెక్ పోస్టు వద్ద ఏసీబీ అధికారులు తనిఖీ చేశారు. ఇందులో కరీంనగర్ ఏసీబీ ఇన్‌స్పెక్టర్ తిరుపతి భోరజ్ చెక్‌పోస్టును ఉదయం 11 గంటలకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో విధులు నిర్వహిస్తున్న ఎంవీఐ యశ్వంత్ కుమార్, ఏఎంవీఐ అపర్ణ ఇద్దరు ఆర్టీవో అధికారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా భోరజ్ చెక్ పోస్టు రికార్డులను హాజరు పట్టిక, కంప్యూటర్‌లో పొందుపరుస్తున్న వాహనాల నిధులపై తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు భోరజ్ చెక్‌పోస్టు పరిసరాలు, ఇందులో ప్రైవేట్ ఉద్యోగులు ఎవరైన విధులు నిర్వహిస్తున్నారన్న అంశంపై ఆరా తీస్తున్నారు. ఇందులో వాహనాల ట్యాక్సుకు మించి ఉన్న రూ.11 వేలను స్వాధీనం చేసుకున్నారు.



ఆదిలాబాద్ పట్టణంలోని దుకాణాల ఎదుట విత్తనాల కోసం బారులుదీరిన రైతులు






ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లోని విత్తనాల దుకాణం వద్ద పత్తి విత్తనం ప్యాకెట్ చూపుతున్న రైతు

- విత్తన వెతలు

# రైతుల గుండెల్లో విత్తన గుబులు

## పత్తి ఇత్తుల కోసం దుకాణాల ఎదుట భారీ బారులు

- వేకువ జాము నుంచే పిల్లలు, వృద్ధులు, మహిళల క్యూ
- విత్తనాలు వచ్చాయని తెలియడంతో తరలివచ్చిన రైతులు
- మండుటెండలో దాదాపు నాలుగు గంటలపాటు పడిగాపులు
- పోలీసు బందోబస్తు మధ్య రెండు ప్యాకెట్ల చొప్పున పంపిణీ
- విత్తనాలు దొరకక నిరాశతో వెనుదిరిగిన కొందరు రైతన్నలు
- కాంగ్రెస్ హయాంలో పదేండ్ల క్రితం నాటి బారులు దర్శనం



క్యూలైన్‌లో నిల్చొని అలిసిపోయిన మహిళా రైతు పోసాని

“ కాంగ్రెస్ సర్కారు వచ్చిందో లేదో అలా కష్టాలు మొదలయ్యాయి. రాంగ రాంగనే అవస్థలను మోసుకొచ్చింది. వానకాలం ప్రారంభం కాక ముందే రైతన్నలకు విత్తనాల కోసం చుక్కలు చూపిస్తున్నది. ఈ పాటికే స్టాక్ పెట్టి, సజావుగా అందించాల్సిన హస్తం సర్కారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. అవసరమైన విత్తనాలను సరిపడా అందుబాటులో ఉంచకపోవడంతో రైతన్నలు గుబులు చెందుతున్నారు. వారం రోజుల్లో రుతుపవనాలు వస్తాయని, వర్షాలను మోసుకొస్తాయని వాతావరణ శాఖ తీపి కబురు అందిస్తుండగా.. విత్తనాల కోసం దుకాణాల వద్దకు రైతులు పరుగులు పెడుతున్నారు. ఎండనకా.. వాననకా వేకువజాము నుంచే గంటల తరబడి బారులుదీరుతున్నారు. దుకాణాదారులు కూడా స్టాక్ తక్కువగా రావడంతో వచ్చిన విత్తనాలను పంపిణీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. తాజాగా మంగళ వారం స్టాక్ వచ్చిందని తెలిసిన వెంటనే రైతులు దుకాణాల వద్దకు తరలివచ్చారు. పెద్ద సంఖ్యలో రైతులు తరలిరావడంతో పోలీసు బందోబస్తు మధ్య విత్తనాలను పంపిణీ చేశారు. వ్యాపారుల వద్ద ఉన్న విత్తనాలను రెండేసి ప్యాకెట్ల చొప్పున పంపిణీ చేయగా.. కొందరు రైతులకు అందకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

ఆదిలాబాద్, మే 28(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా పత్తి విత్తనాల కోసం రైతులు గోస పడుతున్నారు. 280 మంది డీలర్ల వద్ద వివిధ కంపెనీలకు చెందిన చెందిన ఆరు లక్షల బీటీ పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ అవసరమైన వాటి కొరత ఉంది. జిల్లాలో ఈ ఏడాది వానకాలంలో 4 లక్షల ఎకరాల్లో పత్తి సాగువుతుండగా.. 10 లక్షల విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని అధికారులు అంటున్నారు. రైతులు భూములు, వర్షాలు, వాతావరణ పరిస్థితులు, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని విత్తనాలను ఎంపిక చేసుకుంటారు. ఆర్‌సీహెచ్ 659 విత్తనాల ద్వారా ఆశించిన దిగుబడి వస్తుండడంతో రైతులు వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది వానాకాలానికి భూములను సిద్ధం చేసుకున్న రైతులు విత్తనాల సేకరణలో పడ్డారు. ఇతర కంపెనీల బీటీ-2 విత్తనాలను తీసుకునేందుకు ఇష్టపడడం లేదు. వారం రోజుల నుంచి వారికి కావాల్సిన విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు.



విత్తనాల దుకాణం వద్ద లైన్‌లో నుంచి తప్పకొని ముందుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న రైతును వెనక్కి లాక్కెళ్తున్న పోలీస్ అధికారి

### భారీగా తరలివచ్చిన రైతులు

రైతుల డిమాండ్ మేరకు వ్యవసాయశాఖ అధికారులు ఆర్‌సీహెచ్ 659 విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం 27 వేల విత్తన ప్యాకెట్ల స్టాక్ రాగా.. జిల్లా వ్యాప్తంగా పలు దుకాణాల్లో విక్రయాలు జరిగాయి. విత్తనాలు వచ్చిన విషయం తెలుసుకున్న రైతులు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి భారీ సంఖ్యలో తరలివచ్చారు. పట్టణంలోని 13 వేల విత్తన ప్యాకెట్లను విక్రయించడానికి చర్యలు తీసుకున్నామని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. రైతుల రాకతో దుకాణాల్లో భారీ రద్దీ నెలకొన్నది. వందల సంఖ్యలో రైతులు క్యూలో నిలబడ్డారు. విత్తనాల పంపిణీ సందర్భంగా ఆందోళనలు జరగకుండా పోలీసులు పంపిణీ కేంద్రాలకు చేరుకున్నారు. వ్యాపారులు పోలీసు బందోబస్తు మధ్య పంపిణీ చేశారు. అధికారులు విత్తనాల పంపిణీ ప్రారంభించినా రైతులకు సరిపడా అందలేదు. ప్రతి రైతుకు రెండు ప్యాకెట్లను మాత్రమే ఇచ్చారు. మూడు, నాలుగు గంటలు మండుటెండలో పడిగాపులు కాశారు. కొన్ని దుకాణాల్లో గంట వ్యవధిలోనే వ్యాపారులు అమ్మకాలను పూర్తి చేశారు. తమకు వచ్చిన స్టాక్ మేరకు అమ్మకాలు జరిపామని పేర్కొన్నారు. దీంతో క్యూలైన్‌లో నిల్చున్న రైతులు నిరాశతో వెనుదిరుగాల్సిన పరిస్థితి నెలకొన్నది. పది ప్యాకెట్లు అవసరమున్న రైతులకు రెండు మాత్రమే లభించడంతో వారు నిరాశతో వెనదిరిగారు. మరో పది రోజుల్లో వర్షాలు పడే అవకాశాలున్నాయని చినుకు పడగానే తాము విత్తనం వేస్తామని, తమకు సరిపడా విత్తనాలు అందకపోతే ఏమి చేయాలని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### మూడు గంటలు నిలబడ్డా.. ఇత్తులు దొరుకలే..



నాపేరు ప్రవీణ్. నాకు ఆదిలాబాద్ జిల్లాలోని కప్పర్ల గ్రామంలో ఏడెకరాల వ్యవసాయ భూమి ఉంది. నేను యేటా వానకాలంలో పత్తి విత్తనాలు వేస్తా. ఆదిలాబాద్‌కు నాలుగు రోజుల నుంచి విత్తనాల కోసం తిరుగుతున్నా. రాకపోవడంతో వెనుదిరిగి ఇంటికొస్తున్నా. మంగళవారం విత్తనాలు వచ్చాయని మా ఊరు నుంచి ఉదయం ఎనిమిది గంటలకు వచ్చి దుకాణం ఎదుట నిలబడ్డా. నా కంటే ముందుగానే చాలా మంది రైతులు రావడంతో లైన్ పెద్దగా ఉంది. పది గంటలకు అమ్మకాలను ప్రారంభించిన వ్యాపారి గంటలోనే అయిపోయాయని చెప్పిండు. నావరకు రాకుండానే విత్తనాలు అయిపోయాయి. మూడు గంటలు లైన్‌లో నిల్చున్నా దొరకలేదు. వ్యాపారిని అడిగితే మాకు సప్లయి తక్కువగా ఉంది. వచ్చిన విత్తనాలు అమ్మేశామని చెప్పిండు. ఇగ మా బాధ ఎవరికీ చెప్పుకోవాలి. విత్తనాల కోసం రైతులు గోస పడడం పదేండ్ల క్రితం చూసిన. ఇప్పుడు మళ్లీ చూస్తున్న. కేసీఆర్ ఉన్నప్పుడు ఎప్పుడు విత్తనాల కోసం ఇంత గోస పడలేదు. ఈ కాంగ్రెస్ సర్కారోళ్ల కాలంలో మస్తు ఇబ్బంది పడుతున్నం. అధికారులు స్పందించి అవసరమైన విత్తనాలను పంపిణీ చేయాలి. లేకపోతే రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది.

# అన్నదాతల నిరీక్షణ

జైనథ్(బేల), మే 28 : విత్తనాల కోసం రైతులు మళ్లీ పడిగాపులు కాస్తున్నారు. సాగు కోసం సన్నద్ధమవుతున్న రైతులు గంటల పాటు షాపుల ఎదుట క్యూలో నిలబడాల్సిన దుర్భర స్థితి నెలకున్నది. బేల మండల కేంద్రంలో విత్తనాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని గ్రామాల రైతులకు ఒక టేకాడ విత్తనాలు ఇవ్వడంతో ఎండలో ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 7 గంటలకు మండల కేంద్రంలోని నిలేష్ ఆగ్రో ఏజెన్సీ వద్దకు చేరుకుని రాశి 659 కోసం వస్తే రైతులకు కేవలం ఒకే ఒక బస్తానే రైతులకు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. దీని వల్ల నాలుగెకరాలున్న రైతులు ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుందని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకుని సరిపడా రాశి 659 విత్తనాలను సప్లై చేయాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. దుకాణాల వద్ద దాదాపు 1000 మందికిపైగా ఉన్నారు. అసలు విత్తనాలు దొరుకుతాయో లేదో కూడా తెలియదు. ఒక్కరికి ఒక్క బ్యాగు మాత్రమే ఇస్తున్నారు. ఎక్కువ పొలం ఉన్న వారికి కష్టమవుతుందని, కానీ లోపల ఎన్ని బస్తాలు ఉన్నాయో అవి తమకు అందుతాయో లేదో తెలియదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయాధికారులు, పోలీసులు దగ్గరుండి చూడాల్సిన బాధ్యత వారిపై ఉంది. కానీ.. అధికారులు ఎవరు కూడా ఇక్కడ కనిపించడం లేదని రైతులు మండిపడ్డారు.



విత్తన దుకాణం వద్ద బారులుదీరుతున్న రైతులు

### లాఠీచార్జి జరపలేదు..

**ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం**

ఎదులాపురం, మే 28 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పత్తి విత్తనాల కొనుగోలు కోసం వచ్చిన రైతులపై లాఠీచార్జి జరపలేదని ఎస్పీ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలియజేశారు. రైతుల బాగు కోసం అపాయం జరగకుండా రైతులందరినీ ఒక క్రమబద్ధీకరణతో ఉంచడానికి విధులు నిర్వర్తిస్తుంటారనే విషయాన్ని గ్రహించాలన్నారు. ఎటువంటి ఆందోళనకర పరిస్థితులు ఆదిలాబాద్‌లో ఏర్పడలేదన్నారు. ఆందోళనకర అవాస్తవ వార్తలను ప్రచురించి, ప్రశాంతమైన రైతులకు ఇబ్బందికర పరిస్థితిని తీసుకురాకూడదన్నారు. అవాస్తవమైన వార్తలు, ట్రోలింగ్‌లను ప్రచురించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# సబ్ స్టేషన్ నిర్మాణ స్థల పరిశీలన

నేరడిగొండ, మే 28 : వాంకిడి పరిధిలోని గ్రామాల్లో తరచూ కరెంటు సమస్యలు తలెత్తకుండ చేయడానికే విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. వాంకిడి గ్రామ సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటునకు స్థలాన్ని మంగళవారం గ్రామస్తులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఇక్కడ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే విద్యుత్ సమస్యలు తొలిగిపోతాయని పేర్కొన్నారు. అందుకు ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని, త్వరలోనే సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం రాజురా గ్రామం వద్ద నిర్మిస్తున్న లో-లెవల్ వంతెన పనులను పరిశీలించారు. గ్రామస్తులకు ఇబ్బందులు కలుగకుండ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అనంతరం రాజురా గ్రామంలో నిర్మిస్తున్న పాఠశాల భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజు, సవాయిరాం, నాయకులు శ్రీనివాస్, రాథోడ్ రవీందర్, జాదవ్ వసంత్ రావ్, జాదవ్ గణేశ్, అధికారి భీంరావ్ పాల్గొన్నారు.



సబ్ స్టేషన్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

### ఐటీడీఏ పీవోకు ఆదుకోవాలని లేఖ

తాంసి(తలమడుగు), మే 28 : ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా తలమడుగు మండలంలోని పలు గ్రామాల్లో ఆస్తి నష్టం జరిగి నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ పీవోకు లేఖ రాసి నష్టపోయిన బాధితులకు తక్షణ సహాయం అందించాలని కోరారు. ఉమ్రి, దహెగావ్, మందగూడ, పునగూడ, కప్పర్ దేవి, పల్సి తాండల్లో ఈదురు గాలులతో నష్టపోయిన కుటుంబాలను ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజనులను ఆదుకోవాలని లేఖలో కోరారు.

# ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేయాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్**

నిర్మల్ అర్బన్, మే 28 : పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఓట్ల లెక్కింపుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఓట్ల లెక్కింపులో పాల్గొనబోయే సిబ్బంది సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. లెక్కింపు కేంద్రాల వద్ద అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్ రెడ్డి, జీవాకార్, డీఎస్పీ గంగారెడ్డి, డీపీఆర్వో విష్ణువర్ధన్, ఎన్నికల పర్యవేక్షకులు శ్రీనివాస్, ఈడీఎం నదీం పాల్గొన్నారు.

# కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ

ఎదులాపురం, మే 28 : లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ జూన్4న నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి రాజర్షి షా పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సంబంధించిన సిబ్బందికి ట్రెయినర్ లక్ష్మ ణ్ ద్వారా శిక్షణ ఇప్పించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ.. వారం రోజులే ఫలితాలకు సమయం ఉందని, అసెంబ్లీ స్థానాలవారీగా పోలైన ఓట్లు, మొత్తం పోలింగ్ బూత్‌ల ఆధారంలో లెక్కింపు టేబుళ్లను సిద్ధ చేస్తామని చెప్పారు. 4వ తేదీన ఉదయం 8 గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుందని, వేరువేరు టేబుల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. పూర్తి స్థాయి ఫలితాలు వెల్లడికి మధ్యాహ్నం 3 గంటల వరకు సమయం పట్టనుందని, కౌంటింగ్ ప్రక్రియలో ఎన్నికల పరిశీలకులు, సహాయ రిటర్నింగ్ అధికారి, సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్స్ వీరితోపాటు వివిధ పార్టీల ఎన్నికల ఏజెంట్లు ఉంటారన్నారు. ఈ క్రమంలో ఓట్ల లెక్కింపు రోజు విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, కౌంటింగ్ ప్రక్రియను పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. శిక్షణలో పూర్తి అవగాహన కల్పించుకోవాలని తెలిపారు. ఇందులో సహాయ రిటర్నింగ్ అధికారి ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, ఆర్డీవో వినోద్ పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి రాజర్షి షా